'చిన్నప్పుడు తల్లి పక్కలో లేకపోతే నిద్ర పట్టదు. వయసొచ్చాక పెళ్ళాం లేకపోతే కాగిన కోర్కెలతో నిద్ర పట్టదు. కాని ముసలయినాక మాట్లాడడానికి ఆప్యాయంగాస్పృశించడానికితన మనిషి అంటూ ఉండకపోతే కాలం గడవడం కష్టమే!'
మరి, తన 'రాజ్జెం'ను కోల్పోయిన ఎండోడికి పట్టాభిషేకం చేసినంత సంతోషం కలగడానికి కారణం?

# వీడని బంధం

బమ్మిడి జగదీశ్వర రావు

"ఎవులయినా కాయక గొడ్డవుతరు గానీ మనం కాసే గొడ్డోళ్ళమే అయిపోయాం"

"కాసీ వుయ్యడాకి కర్తలం గానీ కర్మానికి కర్తలం కాదు గదా!

ప్రశ్నా తనదే. సమాధానమూ తనదే. దుఃఖమూ తనదే. ఓదార్పూ తనదే. పిచ్చిది. వెర్రిబాగులది. ఎక్కడుందో? ఎక్కడుందీ? పిలిస్తే రాదేం? పిలిస్తే వినపడనంత దూరం వెళ్ళిపోయిందా? తనని ఒంటర్ని చేసి మరీ.... నా రాజ్జెం మనసెలా ఒప్పింది? బగమంతుడు బద్దలయిపోయిన బగమంతుడు నా రాజ్జెన్ని నాక్కాకుండా చేసాడు.

తలచుకుంటే దుఃఖం ముంచుకొచ్చేస్తోంది ఎండోడికి. అలా అని తలచుకోకుండా ఉండలేక పోతున్నాడు. మనువుతో తనువుని పంచినోళ్ళని మర్చిపోడం మనసున్న మడిసికి వల్లకాదు.. వల్లకాదు!

రాజ్జెం చచ్చిపోయి మూడు వారాలయింది. వారం క్రితమే కార్యం జరిగిపోయింది. పేణం పోయినప్పుడు రాలేకపోయినా కార్యానికి అందేరు కొడుకులూ, కూతుర్లూ ఏడ్చారు. ఉన్న ఒక్కగానొక్క పోటో చూసి కూతుర్లు ముద్దులాడారు. మనమలు "అమ్మమ ఏత్తత? నయనమ్మ ఏది? వేసవి సెలవులకు వంట్లో బాగోలేక కథలు చెప్పలేదు. ఇప్పుడు చెప్పకుండా ఎక్కడికి వెళ్ళిపోయింది?" ప్రశ్నించినప్పుడు ఎండోడు నిజంగా ఒ... పిల్లాడిలా ఏడ్చేశాడు.

కార్యం జరిగిన మరుసటి రోజే పిల్లలు బయల్దేరుతూ "అయ్యా, సెలవుల్లేవు. మేం వెళ్ళిపోవాలి. నువ్వూ మాతోటి వచ్చెయ్యి. ఒక్కడివీ ఇక్కడేం చేస్తావు? నీకు ఇష్టమొచ్చిన దగ్గర గడిపేసినా మూడేసి నెలలు మా నలుగురి దగ్గర ఉన్నా సంవత్సరం గడచిపోతది" అన్నారు.

ఎండోడు 'రాలే'నన్నాడు. పిల్లలు బ్రతిమలాడారు. ఊర్లో వాళ్ళు, మిత్తనోర్లు, ఇరుగుపొరుగు నచ్చజెప్పబోయారు. అయినా ఎండోడు తిరస్కరించాడు.

"నీ ఇష్టం" అంటూ పిల్లలు వెళ్ళిపోయారు.

అసలు ఎండోడికి ఆ ఊరు విడిచిపెట్టడం ఇష్టం లేదు. తాతల తండ్రులూ, తనూ పుట్టిందీ పెరిగిందీ అక్కడే. అందుకే అక్కడే గిట్టాలనుకుంటాడు. కన్న తల్లి దండ్రులను విడచి వెళ్ళిపోవచ్చేమో కాని కన్నూరు వదలడం వల్లకాక రాననేసినాడు.

"అవున్రె దద్దా! ఏట్రా నువ్వు సేస్తున్న పని. కొడుకులను కాదని ఇక్కడుండి ఏట్ర తింటావు కణికలు? ఇన్నాళ్ళూ ముసల్దాయి వుండీది. అనో.. ఆడో ముక్కులుకోనో.. మూలుక్కోనో రెండు బియ్యపు గింజలు పొంగించేది. కంత తోడుగా వుండేది. ఆసిటానికి గుద్దులాడుకొని కయ్యాలాడుకొని అలిగినా బువ్వెట్టీది. ఇప్పుడో?" ఇల్లాకత్తల సెగిడోల మాలచ్చిమి అడిగింది.

"అది కాదే గుంటాఁ.. ఆలమ్మ ఎందుకు నచ్చిపోనాదే..?" తిరిగి ప్రశ్నించాడు ఎండోడు.

"బగమంతుడు రమ్మని కబురు సేసినాడెల్లిపోయింది" అంది మాలచ్చిమి.


"ఏదాంత లేనికి గాని.. నిజము ఎవులకి తెల్దే..? ఆలమ్మ పిల్లల మీదే బెంగెట్టుకొని నచ్చిపోనాది. కన్నందుకు ఆలనొకొడ్డుకి తేవాలనీది. కాని ముష్టి బతుకు మూరడే.. మీకు తెలంది కాదు.." నిట్టూర్చాడు ఎండోడు.

"ఎంతెచ్చుకుంటె అంత తప్పదురా ఎండూ! అయినా మనకి తాగటానికి గెంజన్నా వుంది. ఆ గెంజి లేక గింజుకున్నోళ్ళెందరో!" ఎండోడి మిత్రుడు అప్పల్కొండ చుట్ట సుట్టుకుంటూ అన్నాడు.

"పోని గెంజో గడుగో వున్నోర్ల సావరాదట్రా! మరీవోర్ల ఎవరు బతకటం లేదేటి?" ఎండోడు ఇంతెత్తుకు ఎగిరాడు.

"ఆఁ సేనలేరా ఇది మన కాలమేటి? ఇక్కడెవిడి దగ్గరో కంబారరకం వుండాల. మరి కంబారి బతుకు నీకు తెల్దా? పోనెళ్ళిపోనారంతే ఇపుడు సేచ్చగా కష్టపడి గంజి నీళ్ళో ఏవో ఆలబతుకులాలు బతుకుతున్నారు" అన్నాడు అప్పలకొండ.

"ఇక్కడుంతె రాజ్జం ఇంతబేగి నచ్చిపోకపోనే., పిల్లల్ని సూస్తే దానికి కడుపు నిండిపోయీది. ఎప్పుడూ అలూసులు ఎత్తీది. ఎవులొచ్చినా ఆలకతలే సప్పీది. ఉత్తరమొస్తే ఊరంత సూపెట్టీది. ఛాటింపు చేసీది. తనకింత బాగులేక పోయినా ఊషణమొచ్చి నట్టయినా ఉత్తరంలో రాయొద్దనీది. దానికి .రోగమేటీ లేదు. పిల్లలెలాగున్నారని దీవేసిందని ఏడ్చీది. దానికి



ఆలమీదే బెంగ. మనోయాదికి మందేటి? ఆ మనోయాది తోటే తిండి తినక వంటికి తెచ్చుకుంది'' పూడుకుపోతున్న గొంతుతో ఎండోడి నోటివెంట మాటలు రావడం లేదు.

''మరంతదీవేసినప్పుడు కొడుకుల కాడికి పోనావా?'' మాలచ్చిమి అడిగింది.

''నానూ ఎల్లమన్నాను. కాని ఎల్తేనా? 'ఆలే ఒకల్దగ్గర తలమ్ముకుంతే మనమేనికి ఆలపీకల మీదకి అనీది. పట్టనం బతుకులు గడపటం సేనా కష్టం. అన్నీ రేట్లే. మనమెల్తె కరును మీద కరామత్తు ఏనికి అనీది. పీసిముచ్చితనం సేసి దాసిన డబ్బులు మనుమరాలుకు పట్టీలు చేయించింది. మందుల కిచ్చిన డబ్బులతో మమకారం తీర్సుకొనీది..'' కళ్ళు తుడుచుకుంటూ చెప్పాడు ఎండోడు.

''నచ్చినోల్తో మనమూ నచ్చిపోత మేట్రా? అనాగయితే బూమ్మిదొక్కడు మిగలడు. వల్లకోరా.. వల్లకో' అని ఓదార్పు మాటలాడి ''పొలం కాడికి గడ్డికెళ్తా నుంట్రా'' అని వెళ్ళిపోయాడు అప్పలకొండ.

''దద్దుంట్రా వంటకాలేదు. ఆ గొరకడు వంట కాలేదని ఇల్లు పీకి పందిరేస్తాడు'' అంటూ పారిపోయింది మాలచ్చిమి.

మళ్ళీ ఒంటరి వాడయిపోయాడు ఎండోడు. ఇక జీవితాంతం ఒంటరోడే. చిన్నప్పుడే అమ్మపోయి ఆడదాని చేతి చలువ రాజ్జెం దగ్గరే తెలుసుకున్నాడు ఎండోడు.

ఎండోడికి పన్నెండేళ్ళప్పుడే పెళ్ళయిపోయింది. అప్పుడికి రాజ్జెనికి ఏడో, ఎనిమిదో వయసుండీది. చిన్నా పిల్లలాగా కనపడీది. ఎత్తుకొని ముద్దులాడాలనిపించీది. తనూ అదే చేశాడు. అమ్మలక్కలతో పాటు అయ్యా, అమ్మా ఎంత పడీ పడీ నవ్వారో ఎండోడికి ఇప్పటికీ గుర్తుంది.

అప్పటి అమ్మా లేదు. అయ్యా లేదు. ఉన్న ఒక్కగానొక్క తోడు..నీడ.. రాజ్జెం.. ఇప్పుడు రాజ్జెం కూడా లేదు.

ఆ విషయం ఒప్పుకోలేకపోతున్నాడు. తమ మధ్య తిరుగులాడుతున్నట్టే ఉంది. ఒక్క మాటాడితే వందాడి నిలపడే రాజ్జెం, మాటాడితే అలిగే రాజ్జెం.. తను బతిమలాడితే గాని తినని రాజ్జెం..!

చింకి చాపమీద అలానే చేరగిలబడిపోయాడు. ఎండోడు. ఇల్లు వల్లకాడులా తోస్తోంది! క్షణాలు గడుస్తున్నాయి.

''దద్దా.. దద్దా! లెగిసి తినిమీ, మద్దేనం ఏలయిపోనాది. తెల్లారి నుండి పకాలి లేదుకదా టీ నీళ్లయినా తాగినావో లేదో తిను'' అంటూ ఎండోడ్ని



తట్టిలేపి వాడిముందు కంచంతో కూడుపెట్టింది. తరువాత సిలవరి గలాసతో నీళ్ళు పెట్టింది.

ఎండోడు మాలచ్చిమి వేపు చూశాడు. ఒక బుగ్గ కందిపోయి చేతి వేళ్ళు బాగా తట్టుదేరిపోనాయి. అది చూస్తూ ఆశ్చర్యంగా "ఏటయిందే లచ్చి?" అడిగాడు.

"ఏటవుతది, ఆయన గోరికి తిండి లేటయిపోనాదట! మగోడు కదా చెయ్యి సేనుకున్నాడు." అంటూ కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయింది మాలచ్చిమి.

"మగోడు కదా" మాలచ్చిమి మాట ఎండోడి చెవుల్లో గింగిరాలు కొట్టింది. ఎండోడు గతమంత తడిమి చూసుకున్నాడు. ఒకే ఒక్కసారి తను రాజ్జెన్ని కొట్టాడు. "సెయ్యి లిరిగిపోయిన సెయ్యిలు.." తనని తనే తిట్టుకున్నాడు.

ఒకసారి రాజ్జెం పరాసికాలాడుతూ "మీయమ్మ కడేలు అమ్మేసినాను. ఆ సొమ్ముతో మంచి చీర బట్టుకురా" అని ఒత్తినే అంది. కాని ఎంత బేగి తను చెయ్యి సేనుకున్నాడు! నిజం తెలిసి నొచ్చుకుంటే "ఏటి మాఁవాఁ.. అంతలాగ బాధ పడిపోతావు నానంటే నీకెంత గురో తెలుసుకుందామని నాటకమాడాను. కొట్టినా బాధపడేవాడెవడీ కాలం?"అని అడిగింది.

"అన్నంలింకా సెయ్యోట్టలేదా? బేగీ తిను. అవనతల మాయప్ప, బావ వచ్చినారు. ఆలింటికి నానివ్పుడెల్తన్నాను. ఆలపిల్ల నవఁర్తాడిందట. నాను ఇంటికాడుండి పనులు చేస్తే- ఆళ్ళు అందరికీ సెప్పవలసి నోళ్ళకు సెప్పేసొస్తారు. ఆఁ కంచం మీకాడున్నలే "చెప్పేసి వరుగు తీసింది మాలచ్చిమి.

ఎండోడు అన్నంలో వేలెట్టి కెలికాడు. తినబుద్ధి కాలేదు. అలానే పక్కకు తోసి వదిలేశాడు. ఈగలు జుమ్మున ముసురు కుంటున్నాయి. "ఇన్నాళ్ళు రాజ్జెం తనొదిలిన కంచంలో కంత వడ్డించుకు తినీది. కాని ఇప్పుడు కంచం అలానే ఎండిపోయింది. కుక్కొచ్చి అన్నం తినెల్లింది.

సాయంత్రమవుతుండడంతో పొలాలవేపు నడిచాడు ఎండోడు. ఎదురయిన వాళ్లంత విచారంగా ముఖం పెట్టి పరామర్శ మాటలాడుతున్నారు. ఓ గట్టుమీద కూర్చున్నాడు. ఒంటరి తనం మరిన్ని ఆలోచనలకు గురిచేస్తోంది.

ఆ గట్టు మీదనుంచి చూస్తే కనిపించే గడ్డి కుప్ప వెనుక నాయుడు గోరి గుంట సాకలి లచ్చిగోడు పరాసికాలాడుకుంటున్నారు. వాళ్ళను చూసే నరికి ఏ తలపు మనసుని తట్టిందో గాని తృప్తిగా నిట్టూర్చాడు.

అక్కడి నుంచి మళ్ళీ ఊర్లో కొచ్చి వీధి చివరన 'గూటాలు, సంగిడీలు ఎత్తుతుంటే చూస్తూ కూర్చున్నాడే కాని ఒక దగ్గరుండ బుద్ధికావడం లేదు. కూర్చోలేక కష్టం వేసి ఎందుకో అడుగులు అప్రయత్నంగా పడ్డాయి. ఆ రోజు మనిషి ఈ రోజు లేదు. ఆ బుగ్గి కూడా లేదు. ఏట్లోకి తోసేసినట్టున్నారు. కళ్ళ వెంబడి కన్నీటి చుక్కలు టపటపా రాలిపోతుంటే చూశాడు. కళ్ళలో నీళ్ళు ధారకట్టి ఎదురుగా ఉన్నదెవరో గుర్తించలేకపోయాడు.

"మాఁవాఁ.. ఇయ్యాలప్పుడిక్కడేట్రా పద..పద..!" ఆ మాటల్ని బట్టి తెలుసుకున్నాడు ఆ మాటలు కొండోడివని. మాట్లాడకుండానే ఎండోడు వెనుదిరిగాడు అప్పుడు కొండోడు అన్నాడు." అయ్యాఁ.. ఇవాలింట్ల.. రేపు మంట్లని ఒత్తినే అన్నారా? అని చెయ్యి తోడుకొని ఊర్లోకి తీసుకొన్నాడు. వీధి లైట్లు వెలిగి ఆరుతున్నాయి. బుగతోడు పిలిస్తే కొండోడు వెళ్ళిపోయాడు. ఎండోడు అలవాటుగా ఇల్లు చేరుకున్నాడు. ఇల్లు కూడా చీకటి కాష్టంలా ఉంది. దీపం ముట్టించాలనే ధ్యాస లేకుండా అరుగు మీదే చేరగలిబడిపోయాడు. అలసిపోయిన ఒళ్ళుతో అంతలోనే నిద్రలోకు జారుకున్నాడు. ఎండోడిని లేపి ఎవరూ తిండెట్టలేదు. మాలచ్చిమి గుంట ఊరెళ్ళింది.

ఉన్నట్టుండి మధ్యరేతిరి కాడ మెలకువ వచ్చింది ఎండోడికి. గొంతెండిపోతోందేమో "రాజ్జెం, నీళ్ళట్రా" అని అలవాటుగా పిలిచాడు. కాని అంతలోనే తేరుకున్నాడు.


ఒళ్లంత చెమట పట్టింది. మనసంత ఎవరో పిండేస్తున్నట్లయింది. ఊరి మధ్యలో ఉన్నా ఎడారిలోకి విసిరేసినట్లుగా ఆ నిశ్శబ్దాన్ని భరించలేకపోతున్నాడు.

ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ నవ్వులు వినిపించాయి. ఆ నవ్వులకి మల్లెల సొగసంటినట్టు మత్తుగ వీస్తోంది గాలి.

కొత్తగా పెళ్లయిన ఎదురింటి గోరి గోడి, ఆడ్ పెళ్ళమూ జాగారం చేస్తున్నారు.

ఎండోడికి ఏ కోర్కె తలెత్తలేదు. ఆ కాలం దాటి పోయింది. చిన్నప్పుడు తల్లి పక్కలో లేకపోతే నిద్ర పట్టదు. వయసొచ్చాక పెళ్ళాం లేక పోతే కాగిన



కోర్కెలతో నిద్ర పట్టదు. కాని ముసలయినాక మాట్లాడడానికి, ఆప్యాయంగా స్పృశించడానికి తన మనిషి... అంటూ ఉండక పోతే కాలం గడవడం కష్టమే! ఆ స్పర్శే ఎండోడికి కావాలిప్పుడు. ఆ స్పర్శ ఒక నాటి వాంఛతో నిండింది కాదు. ఇప్పుడు తనని దగ్గరకు తీస్కొని మనస్సును లాలించే వారు కావాలి. కష్ట మొచ్చినా అది తీర్చక పోయినా వినే వాళ్ళు కావాలి.

ఇన్నాళ్ళూ తనని సాకే రాజ్జెం లేకపోవడం క్షణం గడపడం కూడా కష్టమౌతోంది. అప్పుడు లెగిసి తలుపు గెడ తీసి ఇంట్లోకి వెళ్ళాడు. దీపం ముట్టించాడు. గాలికి ఆ దీపం ఊగులాడుతుంటే చేతులు అడ్డం పెట్టాడు. కాని తనూ దీపమే! ఇవ్వాలో... రేపో... ఆరిపోయే దీవమే! అంత దాక అడ్డు పట్టే చేతులేవి?

ఆనని చూపుతో గోడనున్న రాజ్జెం తనూ కలిసి దిగిన ఫోటో చేతుల్లోకి తీసుకుని దీపం దగ్గరగా పెట్టి చూశాడు. ఫోటోలో రాజ్జెం కదలాడుతున్నట్లుంది. తన కన్నీరు తతున్తున్నట్లుంది. తనతో మాట్లాడుతున్నట్టుంది.

ఎండోడి జాగారంతో తెల్ల వారింది. వేప పుల్లతో పళ్ళు తోముకొని డికాషను పెట్టుకొని తాగాడు. తరువాత ఏటికి స్నానానికి వెళ్ళాడు. మధ్యాహ్నం వరకు మొల లోతు నీళ్ళలో స్నానం చేసి ఇంటి కొచ్చాడు. 'ఇంతేల కొచ్చావేమ'ని ఎవరడుగుతారు?

ఎండోడికి ఆకలి జోరుగా వేస్తోంది. వన్నాట్లో ఎండ పడుతున్నా ఆకలికి తట్టుకోలేక దాకలో బియ్యం వేసి కడిగి పొయ్యి మీద పెట్టాడు. అది మూడు ఇటుకల పొయ్యి. గడ్డి కర్రలు ముట్టించి ఎగ దోశాడు. ఎండకీ-వేడీకి మధ్య చెమట లెక్కి పోయాడు. నీరసంగా ఉంది. అన్నం జిబ్బి రేకుతో వార్చాడు. వడ్డించుకుని చూసే సరికి అన్న సప్పి ముద్దయి పోయింది.



## సంపాదన

"ఏరా! మీ ఫాదర్ ఈ మధ్య రెండు చేతులా సంపాదిస్తున్నాడటగా!" అడిగాడు శీను.

"ఇక నుంచి అలా జరగదురా." చెప్పాడు కృష్ణ.

"ఏం, ఏమైందిరా?" అడిగాడు శ్రీను.

"మొన్న స్కూటర్ ఆక్సిడెంట్ జరిగింది. అప్పుడు మా నాన్న కుడిచేయి విరిగిందిగా!" దిగులుగా చెప్పాడు కృష్ణ.

కె. వెంకటరామ అక్కయ్య [పామర్రు]

"ఏటిది అన్నమేనేటే! కాస్త బెల్లమెయ్యి పరమాన్న మయిపోద్ది" పెళ్ళాంతో తనన్న మాటలు గుర్తు కొచ్చాయి.

తినాలని లేకపోయినా ఆకలితో కడుపులో పేగులు మెలి తిరిగి పోతుంటే కాసింత గెంజి పోస్కొని, ఉల్లిపాయ తీస్కొని తిన్నాడంటే తిన్నాడని పించుకున్నాడు ఎండోడు. కంచంలో నీళ్ళు పోసి తరువాత కడగొచ్చులే అని ఊరుకున్నాడు.

గోని నంచి పరచుకుని అలా చేర బడ్డాడు.

ఎండోడితో కబుర్లాడడానికి ఒకరిద్ద రొచ్చి వెళ్ళిపోయారు. ఎవ్వరితో మాట్లాడాలని లేదు. ఏదీ చెయ్యాలనీ లేదు. ఏదో చికాకుగా తోస్తోంది.

రోజులు గడుస్తున్నాయి.

ఒక్కో రోజు ఆకలేస్తే...నస్తే వంట చేసోడు లేదంటే పస్తులుండేడు. ఎండోడు భార్య చచ్చి పోయిన రెండు నెల్లకే బాగా లాగేశాడు. చాలా మంది పిల్లల దగ్గరకు వెళ్ళి పోమన్నారు. కాని వెళ్ళా లనిపించలేదు కాబోలు, సమాధానమిచ్చేడు కాదు. ఎన్నో రకాలు చెప్పారు. కాని మూగవాడే అయ్యాడు.

"అయ్యా ఉత్తరం" పోస్టుమన్ కేక విని చూశాడు ఎండోడు.

"కూర్చో" మన్నట్లుగా చూశాడు ఎండోడు. అలవాటు కాబట్టి చెప్పకుండానే ఉత్తరాన్ని చదివి వినిపించాడు.

"అయ్యకు నమస్కారాలు!"

"నీ ఆరోగ్య మెలా ఉంది? నీ మంకు పట్టు మాని ఉత్తర మందిన వెంటనే రావలెను. మీ కోడలు" కూడా చెప్పమంది. నీవు మళ్ళీ తాతవు కాబోతున్నావు మా యమ్మే పుడతాది. అది నా ఇంట పుడతాది. దానికి ఈ చిన్న కొడుకంటే ఇష్టం. అందుకే నా కడుపులో పుట్టి నీ ముక్కు పట్టి లాగుతాది. అమ్మని చూడాలంటే వెంటనే రా"

ఎండోడి ముఖంలో ఏదో ఆనందం రాజ్జెం... నా రాజ్జెం పుడతందా? ఎక్కడి నుండొచ్చిందో శక్తి తెలీదు కాని ఆనందంగా పెద్ద కేకే పెట్టాడు. ఊరంతా విషయం చెప్పాడు. కనిపించి నోళ్ల చెవినంతా ఊదేశాడు. "కొడుకు దగ్గర కెళ్తాను. నా రాజ్జెన్ని చూస్తాను" చెపిందే చెపుతూ ఊరంతా తిరిగేశాడు మనసంతా ఆనందం నిండిపోగ ప్రయాణమయ్యాడు ఊరు దాటాక శ్మశానం కనిపించింది. అడుగులు తడబడ్డాయి.

చిన్న పిల్లాడిలా ఎండోడు కళ్ళు తుడుచు కుంటూ ఏటొడ్డున కూర్చుండి పోయాడు.

★

